సాక్షి వికారాబాద్

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



సిబ్బంది కొరత

విద్యుత్‌శాఖలో సిబ్బంది కొరత వేధిస్తుంది. దౌల్తాబాద్‌లో తరచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. 8లో▸



పత్తి పంట ధ్వంసం

గుర్తు తెలియని వ్యక్తులు చేతికొచ్చిన పత్తి పంటను పాడుచేశారు. 20 గుంటల వరకు ధ్వంసం చేశారు. 8లో▸



వణికిస్తున్న విషజ్వరాలు

పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. రోగులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

ఈకేవైసీ తప్పనిసరి

ఆర్డీఓ శ్రీనివాస్‌రావు



తాండూరు రూరల్: రేషన్‌కార్డులో పేరు ఉన్న ప్రతి సభ్యుడు ఈకేవైసీ చేయించుకోవాలని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం ఆయన ఆర్డీఓ కార్యాలయంలో మాట్లాడుతూ... రేషన్‌కార్డులో పేరు ఉన్న ప్రతి సభ్యుడు ఈపాస్ యంత్రంలో వేలిముద్ర వేసి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ చేయించుకునేందుకు డిసెంబర్ 30 తుదిగడువని తెలిపారు. ఈకేవైసీకి సంబంధించి ఆధార్‌కార్డు అప్డేట్ కానివారి కోసం తాండూరులో రెండు ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ తెలిపారు. పట్టణంలోని తపాల కార్యాలయం, మరొకటి ఎస్‌బీఐ (మెయిన్ బ్రాంచ్)గంజీలో ఉన్న కేంద్రాలకు వెళ్లి ఆధార్ అప్డేట్ చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులతో కాసేపు..



విద్యార్థులకు బోధిస్తున్న జేడీ రాజేందర్‌సింగ్

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ రాజేందర్‌సింగ్ తనిఖీ చేశారు. ఈ విద్యాసంవత్సరంలోనే కళాశాల మంజూరు కావడంతో ఇప్పటివరకు లెక్చరర్ పోస్టులు మంజూరు కాలేదని స్థానిక సర్పంచ్ శిరీష.. జేడీ దృష్టికి తీసుకెళ్లారు. అయితే 42 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారని.. వెంటనే లెక్చరర్ పోస్టులు మంజూరు చేయాలని కోరారు. కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని జేడీ తెలిపారు. ఈ సందర్భంగా జేడీ.. విద్యార్థులకు కొద్దిసేపు బోధించారు.

పాంబండ ఆలయ చైర్‌పర్సన్‌గా నర్సమ్మ



కుల్కచర్ల: శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానం పాలకమండలి నూతన చైర్‌పర్సన్‌గా బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన నర్సమ్మ నియామకమయ్యారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈఓ సుధాకర్ ఈమేరకు శనివారం ఆమెకు నియామకపత్రం అందించి ప్రమాణస్వీకారం చేయించారు. అలాగే పాలకమండలి సభ్యులుగా సంజయ్య, లక్ష్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, చిన్న వెంకటయ్య, నర్సింహులు, ఎల్లయ్య, పాండు, దశరథంను నియమించారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ.. అందరి సహకారంతో ఆలయ అభ్యున్నతికి కృషిచేస్తామన్నారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే కొప్పుల, స్థానిక నేతలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. పర్యవేక్షకులు మధుబాబు, కుల్కచర్ల మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు హరికృష్ణ, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, సర్పంచ్ ఆంజనేయులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి: డీపీఓ

మోమిన్‌పేట: పంచాయతీ కార్యాలయాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో చంద్రాయన్‌పల్లి సర్పంచ్ అంజయ్య జీపీ కార్యాలయంలో ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను డీపీఓ దృష్టికి తీసుకువచ్చారు. నూతన జీపీ భవన నిర్మాణానికి ఇబ్బందిగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తీసి రెండు మీటర్ల దూరంలో పాతాలని కోరినా.. విద్యుత్ సిబ్బంది స్పందించలేదని తెలిపారు. డీపీఓ మాట్లాడుతూ.. జిల్లా పంచాయతీల నుంచి ప్రతీనెల క్రమం తప్పకుండా విద్యుత్ బిల్లులను చెల్లిస్తున్నా.. సేవలు అందించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. ఈ సమస్యను విద్యుత్ ఎస్ఈ దృష్టికి తీసుకుపోతామని తెలిపారు. ఎంపీడీఓ శైలజారెడ్డి,ఎంపీఓ యాదగిరి,సర్పంచ్‌లు అంజయ్య, సత్యనారాయణరెడి తదితరులు ఉన్నారు.

'హక్కులపై అవగాహన అవసరం'

యాలాల: పౌరహక్కుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వీరానందం అన్నారు. బండమీదిపల్లిలో శనివారం నిర్వహించిన పౌరహక్కులపై అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా సోదరభావంతో మెలగాలన్నారు. సమాజంలోని ప్రతిఒక్కరూ స్వేచ్ఛ, సమానత్వ భావనను కలిగి ఉండాలన్నారు. అలాగే అంటరానితనం నిర్మూలన, బాలకార్మికుల చట్టాలపై అవగాహనకల్పించారు. సర్పంచ్ రాంచంద్రమ్మ, గ్రామస్తులు ఉన్నారు.

మరణమే.. శరణ్యమా?

రెండు రోజుల క్రితం తాండూరు మున్సిపాలిటీకి చెందిన మతీన్ అనే వ్యక్తిని పాము కాటువేసింది. కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే వైద్యులు.. పాము కాటుకి తమవద్ద వ్యాక్సిన్ లేదని వైద్య సేవలు అందించేందుకు నిరాకరించారు. ఈ క్రమంలో బాధితుడు ఆస్పత్రిలోనే మరణించాడు. తీవ్ర ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట నిరసన తెలపడంతో పాటు తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గత నెల మాతాశిశు ఆస్పత్రిలో సకాలంలో వైద్య సేవలు అందక 10ఏళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఈ ఘటన ఆస్పత్రి నిర్వహణ తీరుకు అద్దం పట్టింది.ప్రభుత్వ ఆస్పత్రిలో కనీస వైద్యసేవలు కూడా అందకపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- గాడితప్పిన జిల్లా ఆస్పత్రి నిర్వహణ
- రోగులకు సకాలంలో అందని వైద్యసేవలు
- పాముకాటుకూ వ్యాక్సిన్ అందించలేని స్థితిలో ఆస్పత్రి
- అత్యవసర సమయాల్లో ప్రాణాలు కోల్పోతున్న బాధితులు



జిల్లా ఆస్పత్రిలో రోగుల క్యూ

తాండూరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని అధికార పార్టీ నాయకులు ఓ వైపు ప్రకటనలు గుప్పిస్తుంటే.. మరోవైపు క్షేత్రస్థాయిలో పరిస్థితి దానికి భిన్నంగా ఉంది. అరకొర వైద్య సిబ్బంది, సదుపాయాల లేమితో రోగులకు సకాలంలో వైద్యం అందడంలేదు. తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి పైన చెప్పిన దానికి అద్దం పడుతోంది. సరైన వైద్య సదుపాయాలు, సిబ్బంది లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో, ఇతర విపత్తులతో ఇక్కడికి వస్తున్న రోగులకు మరణమే శరణ్యంగా మారింది. ఈ నేపథ్యంలో శనివారం జిల్లా ఆస్పత్రిని సాక్షి పరిశీలించింది. ఆస్పత్రిలో సిబ్బంది, సదుపాయాలు, అందుతున్న వైద్య సేవలపై ప్రత్యేక కథనం మీకోసం..

గాడితప్పిన నిర్వహణ..

తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి నిర్వహణ గాడితప్పింది. ఆస్పత్రిలో నిత్యం అందుబాటులో ఉండి వైద్య సేవలను అందించాల్సిన వైద్యులు.. ప్రైవేట్ ఆస్పత్రులను ఏర్పాటు చేసుకొని వాటికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రిలో మొక్కుబడిగా వచ్చి అటెండెన్స్ వేసి వెళ్తున్నారు. శనివారం రోజు సైతం యధావిధిగా ఉదయం 9 గంటలకు ఆస్పత్రికి వచ్చి సంతకాలు చేసి తిరిగి వెళ్లిపోయారు సదరు వైద్యులు. మరోవైపు ఓపీ వైద్యసేవల కోసం 600 మందికి పైగానే రోగులు ఆస్పత్రికి వచ్చారు. వచ్చిన రోగులకు సిబ్బంది రిజిస్ట్రేషన్ చేసి రశీదులు అందించారు. అయితే 10వ నంబర్ యూనిట్‌లో ఒక వైద్యురాలు మాత్రమే అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించారు. మరో వైద్యుడు మాత్రం కనిపించలేదు. రోగులకు మాత్రలు ఇచ్చి పంపించారు. ఆస్పత్రిలో ఆర్ఎంఓ ఆనంద్‌గోపాల్‌రెడ్డి అందుబాటులో ఉన్నా నిర్వహణ పరమైన పనుల్లో నిమగ్నమై కనిపించారు. ఆర్థో విభాగానికి సంబంధించి వైద్యులు ఎవరూ రాకపోవడంతో ఆ విభాగానికి సంబంధించిన గది గొళ్లెం వేసినట్లుగానే ఉండిపోయింది. మిగతా విభాగాల్లో సైతం దాదాపు ఇలాంటి పరిస్థితే కనిపించింది. అంతేకాకుండా ప్రమాదాల బారినపడే వారికి కట్టుకట్టే గదికి తాళంవేసి వెళ్లడం గమనార్హం.

పాము కరిస్తే పైలోకమే..!

గ్రామీణ ప్రాంతాలకు దగ్గరగా ఉన్న ఆస్పత్రి కావడంతో ఇక్కడికి పాముకాటుకు సంబంధించిన కేసులు అధికంగా వస్తుంటాయి. అయితే పాముకాటుకు సంబంధించి వ్యాక్సిన్ అందుబాటులో లేదని చెప్పి బాధితులను తిప్పి పంపిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల పాముకాటుకు సంబంధించి వచ్చిన మెజార్టీ కేసుల్లో వ్యాక్సిన్ లేదంటూ తిప్పిపంపడంతో వారు ఇక్కడే ప్రాణాలు వదిలిన సంఘటనలు ఉన్నాయి. ఆస్పత్రిలో అన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు విధులకు హాజరుకాని వైద్యులపై చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. అలాగే వైద్య సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

సేవలు అందిస్తున్నాం



ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. శుక్రవారం రాత్రి వార్డుబాయ్‌పై చికిత్స పొందుతున్న రోగి బంధువు దాడి చేశాడు. దీంతో వైద్య సిబ్బంది విధులను బహిష్కరించారు. ఈ కారణంగానే శనివారం రోగులకు వైద్యసేవలు సరిగా అందలేదు. పాముకాటుకు వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. రోగులతో స్నేహపూర్వకంగా మెలగాలని సిబ్బందికి తరచూ సూచనలు చేస్తున్నాం.

– డాక్టర్ మూర్తి, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

ప్రజా నాయకుడు హరీశ్వర్‌రెడ్డి

- ఆయన మృతి బీఆర్‌ఎస్‌కు తీరని లోటు
- మంత్రి సత్యవతి రాథోడ్



హరీశ్వర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్ తదితరులు

పరిగి: వార్డు సభ్యుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన కొప్పుల హరీశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా.. ఉమ్మడి ఏపీ డిప్యూటీ స్పీకర్‌గా చేసిన సేవలు మరువలేనివని, ఆయన మృతి బీఆర్‌ఎస్‌కు తీరని లోటని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. శనివారం పరిగిలో ఆమె హరీశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ.. పదవులను లెక్కచేయకుండా తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపించారని, ప్రజల నుంచి పుట్టిన లీడర్ హరీశ్వర్‌రెడ్డి అని కొనియాడారు. మంత్రి వెంట నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి, దోమ వైస్ ఎంపీపీ గుర్మిట్కల్ మల్లేశ్ తదితరులు ఉన్నారు.

కుష్టువ్యాధిని నిర్మూలిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌బాబు

- రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబు

ధారూరు: ఆరోగ్య కార్యకర్తలు కుష్టువ్యాధి నివారణకు కృషిచేయాలని రాష్ట్ర కుష్టువ్యాధి ప్రోగ్రాం జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబు సూచించారు. శనివారం ఆయన ధారూరు పీహెచ్‌సీలో నిర్వహించిన ఆరోగ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఇంటింటి సర్వే నిర్వహించి కుష్టువ్యాధి అనుమానితులను గుర్తించడం జరిగిందని అన్నారు. కుష్టివ్యాధిని ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే బాధితుడు అంగవైకల్యం బారిన పడకుండా నయం చేయవచ్చని సూచించారు. రాష్ట్రంలో, దేశంలో కుష్టువ్యాధి పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయని తెలిపారు. ఎంపీహెచ్ఈఓ వెంకటేశ్వర్లు, ఆయూష్ వైద్యులు అజ్రా, తాజల్లి, ఇజ్జార్, మాధవీలత, ఎంపీహెచ్ఎస్ సురేందర్, వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా పంపిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: 'యూరియా కటకట..రైతుల తోపులాట' అనే శీర్షికతో శనివారం సాక్షి దినప్రతికలో వచ్చిన కథనానికి జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) గోపాల్ స్పందించారు. ధారూరులోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి 40 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిస్తామని డీఏఓ ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని.. తాము పంపించే 40 మెట్రిక్ టన్నుల్లో ధారూరు కేంద్రానికి 20 మెట్రిక్ టన్నులు, నాగారం కేంద్రానికి 20 మెట్రిక్ టన్నుల చొప్పున కేటాయించామని అన్నారు. వరి పొట్ట దశలో ఉన్నప్పుడే యూరియాను వాడాలని.. ప్రస్తుత దశలో పత్తికి అసలే వాడరాదని రైతులకు సూచించారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని తెలిపారు.

వైద్య కళాశాల ఆధీనంలోకి..



ఆస్పత్రి పత్రాలను వైద్య కళాశాల అధికారులకు అందజేస్తున్న డాక్టర్ ప్రదీప్

వికారాబాద్ ఏరియా ఆస్పత్రి

- ఆస్పత్రి పత్రాలను సమర్పించిన సూపరింటెండెంట్ ప్రదీప్

వికారాబాద్ అర్బన్: దాదాపు 6 దశాబ్దాలపాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పేరుతో సేవలందించిన వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి.. రెండేళ్ల క్రితం ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయ్యింది. తాజాగా ఆ ఏరియా ఆస్పత్రిని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అప్పగించారు. ఈ మేరకు శనివారం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రదీప్ ఆ ప్రక్రియను పూర్తిచేశారు. ఆస్పత్రి పత్రాలను, సిబ్బంది వివరాలను ప్రభుత్వ వైద్య కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ రాంచంద్రయ్యకు అప్పగించారు. ఇన్నాళ్లూ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో పనిచేసిన ఏరియా ఆస్పత్రి ఇప్పుడు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆధీనంలోకి వెళ్లిపోయింది. ఇక్కడ ఆదివారం నుంచి పూర్తిగా వైద్య కళాశాల ఆధ్వర్యంలో సేవలు అందనున్నాయి. ఈమేరకు ఏరియా ఆస్పత్రి బోర్డును కూడా తొలగించి మెడికల్ కళాశాల బోర్డును ఏర్పాటు చేశారు. వైద్య విధాన పరిషత్ కింద పనిచేస్తున్న 10 మంది వైద్యులు, 20 మంది నర్సులు, 10 మంది ఇతర సిబ్బంది కూడా ప్రస్తుతం మెడికల్ కళాశాల బోర్డు కిందనే పనిచేయనున్నారు. జిల్లాలోని ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరాన్ని బట్టి వీరిని సర్దుబాటు చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మధుకర్, హెడ్ నర్సులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అరాచక పాలనకు స్వస్తి పలుకుదాం



టీఆర్ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: బీఆర్ఎస్ అరాచక పాలనకు స్వస్తి పలికే సమయం ఆసన్నమైందని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగిలోని టీఆర్ఆర్ నివాసంలో దోమ మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు శనివారం ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంపీపీ అనసూయ, ఎంపీటీసీ బంగ్ల అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బంగ్లయాదయ్యగౌడ్, కొండాయిపల్లి సర్పంచ్ తనయుడు ప్రసాద్‌గౌడ్, బుద్లపూర్ మాజీ సర్పంచ్ మాధవులు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రరెడ్డి, రాకొండ మాజీ సర్పంచ్ వెంకటయ్య, మాజీ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డితో పాటు దాదాపు 500మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అందరం కలసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. పార్టీలో చేరినవారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, నాయకులు.. పరశురాంరెడ్డి, ఆంజనేయులు, సురేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీహెచ్‌సీలో శ్రమదానం


శ్రమదానం చేస్తున్న సిబ్బంది

యాలాల: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది శనివారం శ్రమదానం నిర్వహించారు. పీహెచ్‌సీకి చెందిన సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఆసుపత్రి ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రధాన గేటు నుంచి ఆసుపత్రిలోనికి వచ్చే మార్గంలో రోడ్డుకిరువైపులా పెరిగిన కంపచెట్లను నరికారు. పిచ్చిమొక్కలు, గడ్డితో పరిసరాల్లో దోమలు, ఇతర కీటకాల బెడద ఎక్కువ కాకుండా ఉండేందుకు తాము శ్రమదానం చేశామని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు కోరారు.

ఉపాధ్యాయ వృత్తి గొప్పది

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్


ఉపాధ్యాయులను సన్మానించిన నాయకులు

పరిగి: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు అన్నారు. పట్టణ కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 24 మందికి శనివారం పరిగిలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. మనఊరు–మనబడితో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. జెడ్పీటీసీ హరిప్రియ, మండల విద్యాధికారి హరిశ్చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

తాళాలు విరగ్గొట్టడం సరికాదు


సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

యాలాల: తమ డిమాండ్ల సాధనకు సమ్మెబాట పట్టిన అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించకుండా కేంద్రాల తాళాలను ఐసీడీఎస్ అధికారులు విరగ్గొట్టడం బాధాకరమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప అన్నారు. శనివారం అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బుగ్గప్ప మాట్లాడుతూ 35 ఏళ్లుగా అంగన్‌వాడీలు, ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ పనిచేస్తున్నారన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహార పంపిణీలో ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు కనీస వేతనం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత!

- జేఎల్‌ఎంలకు పెరుగుతున్న పనిభారం
- విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం
- ఇబ్బందుల్లో జనం
- పట్టించుకోని అధికారులు


దౌల్తాబాద్ సబ్‌స్టేషన్

దౌల్తాబాద్: విద్యుత్ సరఫరా, సబ్‌స్టేషన్ల నిర్వహణలో విద్యుత్‌శాఖ సిబ్బంది పాత్ర చాలా కీలకం. దౌల్తాబాద్ విద్యుత్‌శాఖలో సిబ్బంది కొరత వేధిస్తుంది. ఇక్కడ సరిపడా సిబ్బంది లేని కారణంగా గ్రామాలకు తరచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. సిబ్బంది లేమికారణంగా మరమత్తులు చేసేందుకు తీవ్ర జాప్యం జరుగుతుంది. ఈ క్రమంలో వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఎక్కడైనా సమస్య తలెత్తితే గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఎప్పుడు కరెంట్ వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి నెలకొంది.

జేఎల్‌ఎంలపై పనిభారం...

మండలంలోని విద్యుత్ సరఫరాకు నాలుగు సబ్‌స్టేషన్లు ఉన్నాయి. మండలం మొత్తం 33 గ్రామ పంచాయతీలు అనుబంధ గ్రామాలు, తండాలకు కలిపి నాలుగు సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. ప్రస్తుతం నాలుగు సబ్‌స్టేషన్ల పరిధిలో ఎనిమిది మంది జేఎల్‌ఎంలు, ముగ్గురు స్కిల్డ్, ఒక లైన్‌మెన్, ఒక ఏఈ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఒకటో తేదీ నుంచి 15 వరకు బిల్లులు నమోదు చేయించాలి. 15నుంచి బిల్లులు వసూలు చేయాలి. అలాగే విద్యుత్ సరఫరాలో అంతరాయం జరిగితే వీరే సరిచేసుకోవాలి. దీంతో జేఎల్‌ఎంలపై పనిభారం పెరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే జూనియర్ లైన్‌మెన్ వెళ్లి సమస్యను పరిష్కరించి విద్యుత్‌ను పునరుద్ధరించాల్సి వస్తోంది.

వర్షం పడితే..

చాలా గ్రామాల్లో లూజ్ లైన్లు ఉండడంతో వర్షం పడితే చెట్ల కొమ్మలు తాకి విద్యుత్ ట్రిప్ అవుతుంది. తరచూ విద్యుత్ అంతరాయం జరుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గోకఫసల్వాద్ ఫీడర్ లైన్ సుమారు 10కిలోమీటర్లు ఉండడంతో ఎప్పుడు కరెంట్ ట్రిప్ అవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అంతరాయం కలగకుండా చర్యలు చేపడుతున్నాం..

మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా సరఫరా చేస్తున్నాం. ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించి పునరుద్ధరిస్తాం. విద్యుత్ సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకొస్తే వెంటనే సరిచేస్తాం.

– మహిపాల్, ఏఈ, దౌల్తాబాద్

పత్తి పంట ధ్వంసం

రూ. లక్ష వరకు నష్టం

- ప్రభుత్వం ఆదుకోవాలని మొర


పీకేసిన పత్తి పంటను చూపిస్తున్న కౌలు రైతు సంగమ్మ

పెద్దేముల్: గుర్తు తెలియని వ్యక్తులు చేతికొచ్చిన పత్తి పంటను పాడుచేశారు. సుమారు 20 గుంటల వరకు పీకేశారు. ఈ సంఘటన పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. గొట్లపల్లి సర్పంచ్ పద్మమ్మ, కౌలురైతు సంగమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వీరప్ప పొలాన్ని రూ.35వేలకు కౌలు చేస్తుంది. అందులో పత్తి పంటను సాగు చేసి సుమారు రూ.80వేల వరకు పెట్టుబడి పెట్టింది. పంట చేతికొచ్చే సమయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పంటను పాడుచేసి, పీకేశారు. శనివారం ఉదయం పొలానికి వెళ్లిన సంగమ్మ అక్కడే పడిపోయింది. పంటను చూసి రోదించింది. వెంటనే గొట్లపల్లి సర్పంచ్ పద్మమ్మ పాడైన పంటను చూసి బాధిత రైతుకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరింది.


గాజీపూర్‌లో పాడుచేసిన పత్తి పంట

పేర్ల తొలగింపుపై విచారణ


ఓటరు లిస్టును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ

బంట్వారం: ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగింపు ఫిర్యాదుపై అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం విచారణ చేపట్టారు. కోట్‌పల్లి మండలం కరీంపూర్ జీపీ కార్యదర్శి 150 మంది పేర్లను తీసేశారంటూ కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆయూబ్ అన్సారీ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం కరీంపూర్ గ్రామాన్ని సందర్శించి బహిరంగ విచారణ చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సుమారు గంటకు పైగా ఇరు వర్గాలతో వేర్వేరుగా మాట్లాడి వివరాలు సేకరించారు. ఓటరు లిస్టును క్షుణ్ణంగా పరిశీలించారు. ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగింపునకు కారణాలు తెలుసుకున్నారు. అంతకు ముందు అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ జీపీ కార్యదర్శి సుభాష్‌కు పలు సూచనలు చేశారు. ఎన్నికల నియమ నిబంధనలను తప్పని సరిగా పాటించాలన్నారు. ఇరు వర్గాల వాదనలు పరిగణలోకి తీసుకుని చట్ట ప్రకారం ఓటరు జాబితాను రూపొందిస్తామన్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుందరి అనిల్, తహశీల్దార్ ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకం పనులపై చిత్రీకరణ

కేంద్ర బృందం టీం సభ్యులు అనుపంశ్రీవాస్తవ

మర్పల్లి: ఉపాధిహామీ పథకం పనులు పారదర్శకంగా ఉండేందుకే చిత్రీకరణ కార్యక్రమం చేపడుతున్నట్లు కేంద్ర బృందం టీం సభ్యులు అనుపంశ్రీవాస్తవ అన్నారు. శనివారం కొత్లాపూర్, దార్గులపల్లి గ్రామాలలో చేపడుతున్న పనులను డ్రోన్ కెమెరాతో చిత్రీకరించారు. మండల పరిధిలోని కొత్లాపూర్ గ్రామానికి చెందిన ఉపాధికూలీలు ఉదయం 9 గంటలకు పనులకు వెళ్లే దృష్యాలను కెమెర మెన్ రవికుమార్ తన డ్రోన్ ద్వారా చిత్రీకరించారు. అక్కడి నుంచి పనిప్రదేశానికి వెళ్లి అక్కడ కూలీలు చేస్తున్న పనులను కెమెరాలో బంధించారు. ఈ సందర్భంగా కూలీలకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు అడిగి తెలుసుకున్నారు. జాబ్ కార్డుల జారీ ప్రక్రియ గురించి ఆరా తీశారు. అక్కడి నుంచి దార్గులపల్లి గ్రామంలో గత సంవత్సరం చేపట్టిన నీటి కుంట పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ సర్పంచ్ విజయ్‌కుమార్‌తో మాట్లాడారు. ఉపాధిహామీ పథకం కూలీలకు ఏవిధంగా ఉపయోగ పడుతుంది? అభివృద్ధి పనులతో గ్రామాలు ఏవిధంగా అభివృద్ధి చెందుతున్నాయో పలు విషయాలపై కేంద్రం బృందం సర్పంచ్ విజయ్‌కుమార్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కేంద్రం బృందం సభ్యులు కృష్ణమూర్తి, ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య, ఏపీఓ అంజిరెడ్డి, సీసీ విఠల్, ఐకేపీ ఏపీఎం పోచయ్య, సర్పంచ్‌లు ప్రభాకర్, విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి చందు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.


దార్గులపల్లిలో ఉపాధి పనులను చిత్రీకరిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

దళితబంధు మంజూరులో అన్యాయం

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య


మాలల ముఖ్య నాయకుల సమావేశంలో వెంకటయ్య

పరిగి: దళితబంధు మంజూరు చేయడంలో అధికారులు మాలలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో దళితబంధుపై ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 22న మాలల 'అలయ్ బలయ్' నిర్వహిస్తున్నామన్నారు. అన్ని మండలాల కమిటీ సభ్యులు హాజరు కావలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని కొందరు నాయకులు, అధికారులు నీరుగారుస్తున్నారన్నారు. ఈ పథకం కింద మాదిగలకు 10 ఇస్తే, మాలలకు 2కూడా మంజూరు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చాలా గ్రామాల్లో మాదిగలకే ఇచ్చారన్నారు. దీంతో నియోజకవర్గంలో మాలలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పట్టించుకోవాలన్నారు. మాలల ఆత్మగౌరవం కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందించి అన్ని మండలాల్లో చైతన్యం తీసుకొచ్చి పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు రాములు, విజయ్‌కుమార్, నర్సింహులు, కోళ్ల యాదయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

గుంతను పూడ్చారు

స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పెద్దేముల్: తవ్వారు.. వదిలేశారు. అనేశీర్షికతో శుక్రవారం సాక్షి వికారాబాద్ ఎడిషన్‌లో వచ్చిన వార్తకు మండల అధికారులు స్పందించారు. శుక్రవారం పెద్దేముల్ మండల ఖాణాపూర్ గ్రామానికి ఎంపీడీఓ లక్ష్మప్ప, పంచాయతీ కార్యదర్శి యశ్వంత్‌లు వెళ్లారు. సర్పంచ్ నర్సిములతో మాట్లాడి తవ్విన గుంతను పరిశీలించారు. ఈ సందర్భంగా దానికి సంబంధించిన వివరాలు వారు తెలుసుకున్నారు. ఈ విషయంలో సంబంధిత వ్యక్తులు సమాధానం ఇవ్వాలంటూ ఎంపీడీఓ వారితో చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మళ్లీ గ్రామం నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందజేయాలన్నారు. అనంతరం సర్పంచ్ నర్సిములు, కార్యదర్శి యశ్వంత్‌తో లీకేజైన పైపులైన్ వద్దకు వెళ్లి మరమ్మత్తు పనులను ఎంపీడీఓ ఉండగానే ఆ గుంతను మూసేశారు.


మూసేసిన పైపులైన్ గుంతను చూపుతున్న అధికారులు

వార్డు బాయ్‌పై దాడి


ఆందోళన చేస్తున్న వైద్య సిబ్బంది


వార్డు బాయ్‌పై దాడికి పాల్పడుతున్న రోగి బంధువు మల్లేశ్

జిల్లా ఆసుపత్రి ఎదుట సిబ్బంది ఆందోళన

తాండూరు టౌన్: వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించాడని వార్డుబాయ్‌పై రోగి బంధువులు దాడి చేశారు. ఈ సంఘటన పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సుశీలమ్మ అనారోగ్యంతో పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో చేరింది. ఆమెకు వైద్య సేవలు సరిగ్గా చేయడం లేదని వార్డుబాయ్ జహంగీర్‌ను రోగి బంధువు మల్లేశ్ చితకబాదాడు. ఈ విషయాన్ని వార్డుబొయ్ తోటి సిబ్బందికి తెలియజేశాడు. వారు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. మల్లేశ్‌ను వెంటనే అరెస్టు చేయాలని వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని మల్లేశంను స్టేషన్‌కు తరలించడంతో సమస్య సద్దుమణిగింది.

సొసైటీ లాభాలతో..

- రైతులకు చేయూత
- నావంద్గీ సొసైటీ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి

బషీరాబాద్: నష్టాల్లో కూరుకుపోయిన సొసైటీని రెండేళ్లలో లాభాల బాటలోకి తీసుకొచ్చామని నావంద్గీ సొసైటీ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి అన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు, ఎరువుల విక్రయాల ద్వారా ఈ యేడాది రూ.80 లక్షల ఆర్థిక వనరులు సమకూరినట్లు వెల్లడించారు. ఈ నిధులతో రైతులకు అన్ని విధాల చేయూత అందిస్తామన్నారు. శనివారం సొసైటీ ఆవరణలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ఆర్థిక వనరులు, బకాయిల వసూళ్లు, కొత్త రుణాల మంజూరు వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. ఎల్‌టీలోన్లు, బంగారు ఆభరణాలపై రుణాలు తీసుకున్న మిగిలిన వారు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. రూ. 2 కోట్లతో సొసైటీ ఆధ్వర్యంలో రైస్ మిల్లు, గోదాం నిర్మిస్తున్నట్లు తెలిపారు. త్వరలో పెట్రోల్ బంకునిర్మాణానికి భూమిపూజ చేస్తామన్నారు. 691 మంది రైతులకు ఇప్పటి వరకు రుణమాఫీ అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, డైరెక్టర్లు రంగారెడ్డి, అశోక్ గౌతం, శ్రీనివాస్ రెడ్డి, నవీన్‌రెడ్డి, హన్మిరెడ్డి, రూప్లనాయక్, అనుసూయ బాయి, సీఈఓ బందెయ్య, సిబ్బంది ఫారూక్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నర్సిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్‌రామ్‌రెడ్డి

వాహనం ఢీకొని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి

అనంతగిరి: వాహనం ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ధన్నారం తండా వద్ద శుక్రవారం రాత్రి జరిగిందని టౌన్ సీఐ శ్రీను తెలిపారు. సదరు వ్యక్తి మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, సంబంధికులు ఎవరైనా గుర్తిస్తే వికారాబాద్ పోలీసులకు సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9492301510 లో సంప్రదించాలన్నారు.

జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు


ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని నెల రోజులపాటు అక్టోబర్ 1 నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ సమావేశాలు, సభలు నిర్వహించరాదని తెలిపారు. శాంతిభద్రతలకు, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్ట రాదని ఎస్పీ హెచ్చరించారు.

ప్రజారోగ్యమే ధ్యేయం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: ప్రజా ఆరోగ్యమే ధ్యేయమని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. ఎల్లకొండ గ్రామంలో శనివారం ఆరోగ్య రథాన్ని ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలిపించుకున్న చేవెళ్ల నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. పేదల ఆరోగ్యం కోసం ఎంపీ తన సొంత నిధులతో ప్రజల కోసం ఆరోగ్యరథం నిర్వహిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ అప్పుడే పుట్టిన బిడ్డను మొదలుకొని పండు ముసలి వరకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. దేశంలో ఎక్కడలేని అభివృద్ధి సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రామ్ రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి, సర్పంచులు అజయ్ కుమార్, ఎంపీటీసీ దయాకర్ రెడ్డి, నాగిరెడ్డి, రంగారెడ్డి, ఆనంద్ రెడ్డి, ప్రకాశం, మాణిక్ రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్య రథాన్ని ప్రారంభిస్తున్న కాలె యాదయ్య

టెక్స్‌టైల్స్ కంపెనీలో అగ్ని ప్రమాదం

ధారూరు: మండల పరిధిలోని డీకేతండా సమీపంలోని టెక్స్‌టైల్స్ కంపెనీలో శనివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో సిబ్బంది తన వాహనాలను తీసుకొని బయటకు పరుగులు తీశారు. కంపెనీ నిర్వాహకులు అప్రమత్తమై అగ్నిమాపక వాహనాన్ని రప్పించి మంటలను ఆర్పించారు. బట్టిని వెలిగించడానికి ప్రయత్నిస్తుండగా ట్యాంకులోని ఆయిల్ లీకై మంటలు చెలరేగినట్లు తెలిపారు. ముందుగా ఫైర్ సేఫ్టీ గన్లను ఓపెన్ చేసి కొంతవరకు మంటలను అదుపు చేశారు. తర్వాత ఫైర్ ఇంజన్ వచ్చి పూర్తిగా మంటలను ఆదుపుచేసింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగలేదని నిర్వాహకులు తెలిపారు.


దగ్ధమవుతున్న టెక్స్‌టైల్స్ కంపెనీ


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది